# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 05 అక్టోబరు, 2026 | పేజీలు : 06


## విద్యార్థి హక్కుల కోసం ఉద్యమించేది ఏఐఎస్ఎఫ్



మెయిన్‌లో

# ఉత్సాహపూరితంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

### క్రీడాకారులను పరిచయం చేసుకున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఆదివారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వేములవాడ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ నాయకులతో కలిసి మైదానాన్ని సందర్శించారు. మ్యాచ్‌ల ప్రారంభానికి ముందు క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కనికరపు రాకేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి రాష్ట్రస్థాయి పోటీలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, క్రీడాస్ఫూర్తితో ఆడి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతి, భోజనం మరియు ఇతర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 68 జట్లకు చెందిన దాదాపు 1,300 మంది క్రీడాకారులు పాల్గొని హోరాహోరీగా తలపడుతున్నారు. మైదానంలో కబడ్డీ మ్యాచ్‌లు అత్యంత ఆసక్తికరంగా సాగుతుండటంతో క్రీడాభిమానులు, ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆటగాళ్లను ప్రోత్సహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కరీంనగర్ నగరంలోని 2వ డివిజన్ పరిధిలోని తీగలగుట్టపల్లిలో నూతనంగా ఎన్నికైన డా.బి.ఆర్.అంబేద్కర్ క్లబ్ కార్యవర్గ సభ్యులు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను ముదుకు తీసుకెళ్తూ సంఘం సర్వతోముఖాభివృద్ధికి, బలోపేతానికి సభ్యులంతా ఐక్యతతో కృషి చేయాలని సూచించారు. గౌరవ అధ్యక్షులుగా మాజీ సర్పంచ్ జంగపల్లి మల్లయ్య, అధ్యక్షులు నెరువట్ల శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులు గసికంటి హరిదర్శన్, ప్రధాన కార్యదర్శి సుంకె రామకృష్ణ, కోశాధికారి కనకం కుమారస్వామి, జాయింట్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్, సంయుక్త కార్యదర్శి సంజీవ్, ప్రచార కార్యదర్శి జకినపల్లి అజయ్, ఆఫీస్ ఇంచార్జీ ఆరెపల్లి సిద్దార్థలు ఎంపికయ్యారు. నూతన కార్యవర్గానికి మాజీ ఎంపిటిసీ కొమ్ము భూమన్న శుభాకాంక్షలు తెలిపారు.

## అథ్లెటిక్స్ ఎంపికల్లో యువ క్రీడాకారుల ప్రతిభ

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ ఎంపిక పోటీలు నిర్వహించారు.అండర్–14, అండర్–16 విభాగాల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు.రాష్ట్ర అబ్జర్వర్,సిరిసిల్ల జిల్లా జనరల్ సెక్రటరీ భోజ చంద్రశేఖర్ పోటీలను ప్రారంభించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 13 మంది క్రీడాకారులను తదుపరి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరు 14 నుంచి 16 వరకు వోక్సేన్ యూనివర్సిటీ, కాంకోలే, సదాశివపేట హైదరాబాద్‌లో నిర్వహించే నేషనల్ ఇంటర్ డిస్టిక్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి గట్టయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి జావిద్, జాయింట్ సెక్రటరీ దుర్గాప్రసాద్,ప్రణయ్,శ్రీ విష్ణు,అజయ్, మౌనికతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి బరిలో ఐవివైఎస్ నరేన్ క్రీడాకారిణులు

ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్: క్రీడా రంగంలో సత్తా చాటుతున్న ఐవివైఎస్ నరేన్ క్రికెట్ అకాడమీ విద్యార్థులు మరో ఘనతను సొంతం చేసుకున్నారు. సిరిసిల్లలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ అండర్17 బాలికల క్రికెట్ ఎంపిక పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అకాడమీకి చెందిన అనబేటాల్, శర్వాణి, విశేష రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపిక పోటీల్లో క్రీడాకారిణులు ప్రదర్శించిన ప్రతిభ ఆటతీరు, పట్టుదల, సమయస్ఫూర్తి ఎంపికదారుల ప్రశంసలు అందుకుంది. ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో ఐవివైఎస్ నరేన్ క్రికెట్ అకాడమీలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఐవివై పాఠశాల చైర్మన్ పసుల మహేశ్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి వారికి సరైన శిక్షణ, ప్రోత్సాహం అందించడమే అకాడమీ లక్ష్యమన్నారు. చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. రాష్ట్రస్థాయికి విద్యార్థులు ఎంపిక కావడం వారి కృషితోపాటు కోచ్‌ల శిక్షణ, తల్లిదండ్రుల ప్రోత్సాహానికి దక్కిన ఫలితమని పేర్కొంటూ భవిష్యత్‌లో జాతీయస్థాయిలో రాణించేలా ప్రోత్సాహం అందిస్తామని అన్నారు. అకాడమీ



కోచ్ నరేన్ మాట్లాడుతూ క్రీడాకారిణులు నిరంతరం సాధన చేస్తూ తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజయాలు సాధించి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

## విప్ ఆది శ్రీనివాస్ నేతృత్వంలో మూడో రోజుకు చేరిన పోటీలు



ప్రజాపక్షం/వేములవాడటౌన్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త కబడ్డీ పోటీలు ఆదివారం మూడవ రోజు వేములవాడలో అత్యంత ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. ఈ పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారుల శారీరక ఉత్సాహం, శక్తిని పెంపొందించేందుకు వేములవాడ రాజన్న ఫార్మసీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఎనర్జిటిక్ డ్రింక్ ఏర్పాటు చేశారు. ఈ ఎనర్జీ డ్రింక్‌ను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, ఫ్యాక్స్ చైర్మన్ వకుళభరణం శ్రీనివాస్, పట్టణ కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమమే లక్ష్యం.. కాంగ్రెస్ బలోపేతమే ధ్యేయం



ప్రజా పక్షం/వేములవాడ టౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెక్రటరీగా వేములవాడ పట్టణానికి చెందిన సోహెల్ ఖాన్ ఆదివారం రోజున నియమితులయ్యారు. పార్టీ బలోపేతానికి గత కొన్నేళ్లుగా చేస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ బాధ్యతలు అప్పగించిన అధిష్ఠానానికి, రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్‌కు సోహెల్‌ఖాన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ చైర్మన్ షేక్ రియాజ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మత్ ఉల్లా హుస్సేనీ, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాంగ్రెస్ పార్టీతోపాటు మైనార్టీ విభాగాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని సోహెల్ ఖాన్ పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రతి గడపకు ప్రభుత్వ పథకాల సమాచారం చేరేలా అవగాహన కల్పిస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులందరికీ మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఆదివాసీలకు అండగా ఉంటాం

ప్రజాపక్షం/కరీంనగర్: ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తామని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర సెక్రటరీ అంబటి జోజిరెడ్డి అన్నారు. కరీంనగర్‌లో ఆదివారం ఆదివాసీ హక్కుల సాధన సమితి (ట్రైబ్స్) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆదివాసీలకు భూమి హక్కులు కల్పించడంతో పాటు



విద్య, వైద్యం, ఉపాధి, సాగునీరు, మౌలిక వసతులు అందించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. పోడు భూముల రక్షణకు ఆదివాసీల తరఫున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ఆదివాసీలు నిర్వహిస్తున్న కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అంబటి జోజిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. హక్కుల సాధన కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీలకు న్యాయం జరిగే వరకు వారి సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. సమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆదివాసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పూల పండుగ మన సంస్కృతికి ప్రతీక: ఇఒ రమాదేవి

ప్రజాపక్షం/వేములవాడ టౌన్: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ రాజరాజేశ్వర సంస్కృత విద్యాసంస్థలు, పాఠశాలలో శనివారం ముందస్తు బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. దసరా (బతుకమ్మ) సెలవులు



ప్రారంభమవుతుండటంతో పాఠశాల ప్రాంగణంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎల్.రమాదేవి ముఖ్య అతిథిగా హాజరై, ఉపాధ్యాయులు, విద్యార్థినులతో కలిసి స్వయంగా బతుకమ్మ ఆడారు. తీరొక్క పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మల చుట్టూ విద్యార్థినులు చప్పట్లు కొడుతూ పాటలు పాడగా, బాలురు దాండియా, కోలాట నృత్యాలతో సందడి చేశారు. అనంతరం ఈవో రమాదేవి బతుకమ్మను తలపై ఎత్తుకొని విద్యార్థులతో కలిసి వెళ్లి శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల పర్యవేక్షకులు వెంకటలక్ష్మి, పూజిత, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, ఆలయ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంజెపి పాఠశాల తరలింపుపై యువజన సంఘాల ఆగ్రహం



ప్రజాపక్షం/గన్నేరువరం : గన్నేరువ రం మండలానికి మంజూరైన ఎంజేపీ (మహాత్మ జ్యోతిభా పూలే) గురుకుల పాఠశాలను వేరే ప్రాంతానికి తరలించే ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని స్థానిక యువజన సంఘాల నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. గన్నేరువరానికి మంజూరైన ఈ పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తన స్వగ్రామమైన మానకొండూర్ మండలం పచ్చునూరుకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని అది ఎంతమాత్రం తగదని వారు హెచ్చరించారు. ఆదివారం గన్నేరువరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ యువజన సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. మండల ప్రాంత విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం గన్నేరువరానికి ఎంజేపీ పాఠశాలను మంజూరు చేసిందని అయితే స్థానిక ప్రజాప్రతినిధి తన స్వంత లాభం కోసం లేదా స్వగ్రామ ప్రాధాన్యత కోసం దీనిని తరలించాలని చూడడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. వెనుకబడిన గన్నేరువరం మండల విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమయ్యేలా పాఠశాలను తరలిస్తే ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎంజేపీ పాఠశాల తరలింపు ప్రయత్నాలను వెంటనే మానుకోవాలని లేనిపక్షంలో మండలవ్యాప్తంగా యువజన, విద్యార్థి సంఘాలు, ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు యువజన సంఘాల నాయకులు కాల్వ నాగరాజు, కుర్ర హరీశ్, గంట గౌతమ్, రంగనవేని శ్రీనివాస్, బోయిని కుమార్, బోయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచులను వేధిస్తే సహించం

ప్రజాపక్షం/గంగాధర : గంగాధర మండలం కొండాయపల్లి సర్పంచ్ మల్యాల తిరుపతి అలియాస్ వినయ్ సాగర్ ఆత్మహత్యాయత్న ఘటనపై తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తనను టార్గెట్ చేసి అవమానిస్తున్నారని కేసులు పెట్టి వేధిస్తున్నారని సర్పంచ్ ఆరోపించినట్లు వార్తలు వస్తున్నాయని తెలిపారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి నిధులు అడిగినంతమాత్రాన సర్పంచులను రాజకీయంగా వేధించడం సరికాదన్నారు. ప్రజలు ఎన్నుకున్న సర్పంచులను గౌరవించాలని వేధింపులకు పాల్పడితే జేఏసీ సహించబోదని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని అన్నారు. ఎవరూ అధైర్యపడవద్దని ఆత్మహత్యలకు పాల్పడవద్దని పోరాటం ద్వారానే సాధించుకుందామని సర్పంచులకు విజ్ఞప్తి చేశారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ప్రజాపక్షం/గంగాధర : గంగాధర మండలంలోని కొండన్నపల్లి గ్రామ పరిధిలోని ఎస్సారెస్పీ ఫ్లడ్ కెనాల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడు నీలం రంగ షర్ట్, నలుపు రంగ్ లోయర్ ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలను తెలిసినవారు గంగాధర పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వంశీ కృష్ణ తెలిపారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభానికి అల్లుకున్న చెట్ల తీగలు

ప్రజాపక్షం/గన్నేరువరం : గన్నేరువరం మండల కేంద్రంలోని ప్రధాన కూడలైన అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి చెట్ల తీగలు, పొదలు విపరీతంగా అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ తీగలను తాకుతూ ఈ తీగలు పాకిపోవడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని స్థానికులు, బాటసారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ తీగలలోకి విద్యుత్ సరఫరా జరిగి షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ చౌరస్తా ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతం కావడం వల్ల కాలినడకన వెళ్లే ప్రజలు వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ స్తంభానికి తీగలకు అల్లుకున్న చెట్ల తీగలను తొలగించి ముందస్తు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## మున్సిపల్ కార్మికుల సేవలు అనిర్వచనీయం

ప్రజాపక్షం/వేములవాడ టౌన్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవ వేడుకల పక్షోత్సవాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులను బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి సంటి మహేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం కేవలం భారతదేశానికే కాకుండా, ప్రపంచానికే దిశా నిర్దేశం చేసే స్థాయికి ఎదిగిందని కొనియాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో 140 కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తూ, దేశాన్ని అగ్రపథాన నిలుపుతున్న మహోన్నత నాయకుడు మోదీ అని ప్రశంసించారు. అనంతరం మున్సిపల్ కార్మికులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, కుమ్మరి శంకర్, సంటి అంజిబాబు, చిక్కుడు మల్లేశం, సగ్గు రాహుల్, కట్కం శ్రీనివాస్, మరియు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



ప్రజాపక్షం/మెట్‌పల్లి: మెట్‌పల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారపు లింబాద్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించాలని నిర్వాహకులు కోరారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు, కార్యదర్శి ఎల్మి రవి, కోశాధికారి దొంతుల లక్ష్మీనారాయణ, వాసవి దేవాలయం అధ్యక్షులు చాద సురేష్,వాసవి గార్డెన్ అధ్యక్షులు కోట కిరణ్‌కుమార్,దేవాలయ కార్యదర్శి చిట్టిమెల్లి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# దివంగత మాజీ మంత్రి జయంతి వేడుకలు



ప్రజాపక్షం/మల్లాపూర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి దివంగత నేత జువ్వాడి రత్నాకర్ రావు జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ మేరకు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, ఆయా గ్రామాల్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతి రెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న,పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాట్ల సోమయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు రోండ్ల రాజేశ్వరి రాజా రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు ఏగ్యారపు లింబాద్రి , రాజేందర్ పథకాల కిరణ్ మానస, రమేష్, పద్మ నరసయ్య, వెంకటేష్ , వెంకట్ రెడ్డి, కిషన్ గౌడ్, గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిజన సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా రాజేందర్



ప్రజాపక్షం/మల్లాపూర్: తెలంగాణ గిరిజన సర్పంచుల ఫోరం జగిత్యాల జిల్లా అధ్యక్షునిగా మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్లవత్ రాజేందర్ నాయక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా సదస్సులో రాజేందర్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా గిరిజన సర్పంచ్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ నాయక్ నియామక ఉత్తర్వులను అందజేశారు. తనపై నమ్మకం ఉంచి తనను గిరిజన సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు ఎన్నుకున్న గిరిజన సర్పంచులకు ఆయన స ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ అందరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తానని తెలిపారు. కాగా మండలానికి చెందిన రాజేందర్ నాయక్ గిరిజన సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల పలువురు గిరిజన నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# రైతులకు చేరువగా జగిత్యాల పిఏసిఎస్ సహకార సేవలు

## నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న దామోదరరావు

ప్రజాపక్షం/జగిత్యాల రూరల్: జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పీఏసీఎస్ చైర్మన్‌గా జగిత్యాల మండలం ధరూర్ గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది కొలుగూరి దామోదరరావు నియమితులయ్యారు.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దామోదరరావుతో పాటు పీఏసీఎస్ పాలకవర్గంలో సభ్యులుగా 12 మందిని ప్రభుత్వం నియమించింది. దీంతో జగిత్యాల పిఎసిఎస్‌కు నూతన పాలకవర్గం ఏర్పడింది. చైర్మన్‌గా తనను నియమించినందుకు కొలుగూరి దామోదరరావు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, డిసిసి అధ్యక్షుడు గాజంగి నందయ్యలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జగిత్యాల పీఏసీఎస్ పరిధిలోని రైతులకు సహకార సేవలు మరింత అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేస్తానని దామోదరరావు తెలిపారు. రైతుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సేవలను సకాలంలో అందించేందుకు పాలకవర్గ సభ్యులతో కలిసి పనిచేస్తానన్నారు. పీఏసీఎస్‌ను రైతులకు మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దడంతో పాటు, సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. దామోదరరావు నియామకం పట్ల ధరూర్ గ్రామంతో పాటు జగిత్యాల ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు, న్యాయవాదులు,రైతులు,ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# గురుకుల పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు



ప్రజాపక్షం/గొల్లపల్లి: జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల (బాలికల) లో ఆదివారం ముందస్తు బతుకమ్మ పండుగ వేడుకలను అత్యంత వైభవంగా ,సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు కలిసి రంగురంగుల తీరొక్క పూలతో బతుకమ్మలను ఎంతో అందంగా తీర్చిదిద్దారు. అనంతరం గౌరమ్మను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ వేడుకల్లో బాలికలు ,మహిళ ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులలో మెరిసిపోయారు . అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థినిలు,మహిళ ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మలను మధ్యలో ఉంచి చప్పట్లు కొడుతూ,సాంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, ఉత్సాహంగా నృత్యాలు చేశారు.బాలికల ఆటపాటలు, కోలాటాలతో పాఠశాల ప్రాంగణమంతా కోలాహలంగా మారి పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయ బృందం , విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తండ్రీకొడుకులకు భారత్ కళా పురస్కార్ అవార్డులు

## ఒకే వేదికపై అవార్డులు అందుకున్న వడ్లూరి రవీందర్, సాత్విక్



ప్రజాపక్షం/ధర్మపురి: ఫొటోగ్రఫీ రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్న ధర్మపురికి చెందిన తండ్రీకొడుకులు వడ్లూరి రవీందర్, వడ్లూరి సాత్విక్‌లకు ప్రతిష్ఠాత్మక భారత్ కళా పురస్కార్ అవార్డులు లభించాయి.ఒకే కుటుంబానికి చెందిన తండ్రీకొడుకులు ఒకే వేదికపై, ఒకే రోజు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకోవడం విశేషంగా నిలిచింది.తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఫొటో పరివార్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫొటో ట్రేడ్‌షోలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన ఫొటోగ్రాఫర్లను ఎంపిక చేసి భారత్ కళా పురస్కారాలతో సత్కరించారు.ఈ సందర్భంగా ధర్మపురికి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ వడ్లూరి రవీందర్‌కు బెస్ట్ ట్రెడిషనల్ ఫొటోగ్రాఫర్ అవార్డు, ఆయన కుమారుడు వడ్లూరి సాత్విక్‌కు బెస్ట్ క్యాండిడేట్ ఫొటోగ్రాఫర్ అవార్డు లభించాయి.సుదీర్ఘకాలంగా ఫొటోగ్రఫీ రంగంలో కొనసాగుతున్న వడ్లూరి రవీందర్ సంప్రదాయ ఫొటోగ్రఫీలో తనదైన శైలిని ఏర్పరుచుకున్నారు. వివిధ శుభకార్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక అంశాలను తన కెమెరాలో అందంగా బంధిస్తూ ఫొటోగ్రఫీ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయనకు లభించిన ఈ పురస్కారం ఆయన ప్రతిభకు, ఫొటోగ్రఫీ రంగంలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా నిలిచింది.అదేవిధంగా ఆయన కుమారుడు సాత్విక్ కూడా తండ్రి అడుగుజాడల్లో ఫొటోగ్రఫీ రంగంలో ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారు. క్యాండిడ్ ఫొటోగ్రఫీలో సహజమైన భావోద్వేగాలను, ప్రత్యేక సందర్భాలను కెమెరాలో అద్భుతంగా బంధిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారు. ఈ క్రమంలో బెస్ట్ క్యాండిడేట్ ఫొటోగ్రాఫర్గా అవార్డు అందుకోవడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఫొటోగ్రాఫర్లు హర్షం వ్యక్తం చేశారు.భారత్ కళా పురస్కారాలు అందుకున్న వడ్లూరి రవీందర్, సాత్విక్‌లను ధర్మపురి పట్టణానికి చెందిన ప్రజలు, ఫొటోగ్రాఫర్లు, స్నేహితులు,బంధువులు అభినందించారు.భవిష్యత్తులో ఫొటోగ్రఫీ రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం



ప్రజాపక్షం/ధర్మపురి: రాష్ట్ర,జిల్లా, మండల స్థాయిలో 2026 సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఆర్యవైశ్య ఉపాధ్యాయులను ఆదివారం జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.జిల్లా ఆవోపా అధ్యక్షుడు రాజేశుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ధర్మపురి ఆవోపా ప్రతినిధులను సైతం సన్మానించారు.ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీతలు కూరగాయల చంద్రశేఖర్, గంప విద్యాదేవి, దొంతుల శ్రీధర్, నాగమల్ల శ్రీలత తోపాటు ధర్మపురి ఆవోపా ప్రతినిధులు జక్కు రవీందర్,రంగ శ్రీనివాస్,జొన్నల వీరేశం, అక్కనపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజేశుని శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించడం ఆవోపా ప్రధాన లక్ష్యాల్లో ఒకటని తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారికి అభినందనలు తెలియజేస్తూ, వారి సేవలు మరెందరికో స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు.

# జువ్వాడి రత్నాకర్ రావుకు ఘన నివాళి



ప్రజాపక్షం/మెట్‌పల్లి: మాజీ మంత్రి, దివంగత జువ్వాడి రత్నాకర్ రావు 99వ జయంతి సందర్భంగా మెట్‌పల్లిలోని జువ్వాడి భవన్‌లో ఆయన చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్ రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోరుట్లలోని వెటర్నరీ కళాశాల వద్ద జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహానికి జువ్వాడి నర్సింగ్ రావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గజంగి నందయ్య, జువ్వాడి కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు, పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం జువ్వాడి రత్నాకర్ రావు జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న శఠకోప రామానుజ జియర్ స్వామి



ప్రజాపక్షం/బీర్‌పూర్: జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్న తమిళనాడు శ్రీవిల్లిపుత్తూర్ స్వామి మానవాళ మాముని సన్నిధి 23వ పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ శఠకోప రామానుజ జియర్ స్వామి వారు ఆదివారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన జియర్ స్వామి వారికి దేవాలయ అర్చకులు, అధికారులు సాంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం స్వామి వారు ఆలయంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జియర్ స్వామి వారు భక్తులకు, ఆలయ సిబ్బందికి తన మంగళాశాసనాలు (ఆశీస్సులు) అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి.కిరణ్,దేవాలయ పునరుద్ధరణ కమిటీ (రెనోవేషన్ కమిటీ) చైర్మన్ చీర్నెని శ్రీనివాస్, కమిటీ సభ్యులు మల్లేశం, సురేందర్,సుభాష్, ఉపసర్పంచ్ ఎనగంటి జితేందర్,దేవస్థాన అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్ చార్యులు, చిన్న సంతోష్ చార్యులు, మధుకుమార్ చార్యులు మరియు ఆలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ట్రస్మా మండల అధ్యక్షుడికి సన్మానం



ప్రజాపక్షం/రాయికల్: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాయికల్ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డిని రాయికల్ ప్రెస్ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రెస్ జేఏసీ అధ్యక్షుడు చింతకుంట సాయికుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి, విద్యాభివృద్ధికి ట్రస్మా ప్రతినిధులు కృషి చేయాలని ఆకాంక్షించారు.జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ ఇచ్చేలా చూడాలని,నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాజు రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సింగిడి శంకరయ్య, కోశాధికారి కడకుంట్ల జగదీశ్వర్, ఉపాధ్యక్షుడు సింగని శ్యాంసుందర్,సహ కార్యదర్శి తిరుమల శంకర్, కార్యవర్గ సభ్యులు తీగుళ్ల గోపి, ఒరుగంటి భీమరాజు,కల్లెం శ్రీనివాస్,ప్రెస్ జేఏసీ సభ్యులు అనుపురం లింబాద్రి,వాసం లింబాద్రి, ఎనుగంటి రాజు, వట్టిమల్ల గంగాధర్, మహమ్మద్ షాకీర్, గట్టుపెల్లి నరేష్,మొగిలిపాక మహేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి విహెచ్ఆర్ చేయూత



ప్రజాపక్షం/అంతర్గాం: పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన మంద మల్లయ్య ఇటీవల ఆనారోగ్యంతో మరణించారు. గ్రామస్థుల ద్వారా విషయం తెలియడంతో విహెచ్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్‌రెడ్డి స్పందించి బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం ఆదివారం అందజేశారు. గ్రామ సర్పంచి ఆముల పెద్ద శ్రీనివాస్ చేతుల మీదుగా బాధిత కుటుంబసభ్యులు మంద శేఖర్, కోల బాపులకు బియ్యం అందజేసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కొలిపాక శరణ్య మధూకర్‌రెడ్డి, అఖిల భారత యాదవ సంఘం అంతర్గాం మండల అధ్యక్షుడు పుట్ట శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు బైరి సురేష్‌గౌడ్, సందనవేన సాయియాదవ్, స్టాలిన్‌లు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఇందిరమ్మ చీరల పంపిణీ



ప్రజాపక్షం/గోదావరిఖని: రామగుండం నగరపాలక పరిధిలోని పీకే రామయ్యకాలనీ, ఇందిరమ్మ కాలనీలలో బతుకమ్మ ఇందిరమ్మ చీరలను ఒకటో డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ ఆదివారం మహిళలకు పంపిణి చేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి అందజేస్తామని కార్పొరేటర్ కాలనీల ప్రజలకు తెలియజేశారు.

## మధుకర్‌జీకి 'సోమారపు' శుభాకాంక్షలు!



ప్రజాపక్షం/రామగుండం: బిజెపి తెలంగాణ రాష్ట్ర సంస్థాగత మంత్రిగా ఆదివారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన నూకల మధుకర్‌జీని కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆ పార్టీ రామగుండం నియోజకవర్గ నాయకులు సోమారపు లావణ్య, అరుణ్‌కుమార్‌లు తెలిపారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మధుకర్‌జీని కలిసి అభినందించినట్లు వారు తెలిపారు.

# మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని విధిగా చదవాలి

### ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్

### సీరతున్నబి టాలెంట్ టెస్టులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు



ప్రజాపక్షం/పెద్దపల్లి : మహనీయ మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ విధిగా అధ్యయనం చేసి చదవాలని అనునిత్యం మహమ్మద్ ప్రవక్త చూపిన బాటలో నడవాలని ప్రవక్త సూచనలను పాటించాలని మజిలీస్ తహఫూజ్ ఖత్మే నబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్, ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దపల్లి పట్టణంలో మూన్ ఫంక్షన్ హాల్ లో సఫా బైతుల్ మాల్ పెద్దపల్లి అధ్యక్షుడు ముఫ్తి ఇంతియాజ్ ఖాన్ మిఫ్తాహి ఆధ్వర్యంలో నిర్వహించిన సీరతున్నబి టాలెంట్ టెస్టు పరీక్షలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సదస్సులో ముఫ్తి సాదిఖ్ హుస్సేన్, మౌలాన కాజిమ్ ఆల్ హాసని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ప్రవక్త జీవితాన్ని పూర్తిగా చదవాలని, సమాజంలో నేడు పట్టి పీడిస్తున్న సామాజిక రుగ్మతలను పారద్రోలేందుకు సమాజ స్థితిగతులను చెడు మార్గం నుంచి మంచి మార్గం వైపు తీసుకెళ్లేందుకు ప్రవక్త జీవితం దోహదపడుతుందన్నారు. ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో ముఫ్తి సాదిక్ హుస్సేన్, మౌలాన కాజిమ్, మౌలాన లాయిఖుల్లా, ముఫ్తి ఇంతియాజ్ ఖాన్, ముఫ్తి షఫిక్, మౌలాన జమీల్ అహ్మద్, మౌలాన హైదర్, కలీమ్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

# 'బతుకమ్మ' ఘాట్ ఇలా..మహిళలు ఆడేదెలా..!



ప్రజాపక్షం/రామగుండం: రామగుండం పట్టణంలో గత 75 ఏళ్లుగా దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణ మహిళలు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకుంటున్నారు. పట్టణంలోని 25, 27, 28, 29, 30వ డివిజన్లకు చెందిన మహిళలు ప్రతిఏటా సద్దుల బతుకమ్మ రోజున స్థానిక జెన్‌కో ఎకాలనీలోని పెద్ద కాలువ బతుకమ్మ ఘాట్ వేదిక వద్దకు చేరుకుని సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆడుతూ కాలువ నీటిలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. ఈ మేరకు రామగుండం నగరపాలక అధికారులు ప్రతియేటా ఇక్కడి బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాట్లు చేపడ్తున్నారు. కానీ, ప్రస్తుతం ఇంతవరకు ఏలాంటి ఏర్పాట్లు మొదలుపెట్టలేదు. కనీస సౌకర్యాలు కూడ కల్పించడంలేదు. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు కాలువకు ఇరువైపుల మెట్ల నిర్మాణం చేపట్టలేదు. చుట్టూ చెట్లు, పొదలు దట్టంగా పెరిగాయి. కాలువ నీటిలో దిగేందుకు కూడ దారి లేదు. బతుకమ్మ ఘాట్ చుట్టూ చీకటిగా ఉంది. గతంలోగా బతుకమ్మ ఘాట్‌ను శుభ్రం చేసి, కాలువలోకి దిగేలా మెట్లు నిర్మించి, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసి, మైక్ సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని మహిళలు కోరుతున్నారు. బతుకమ్మ, దసరా పండుగలు సమీపిస్తుండటంతో ఇప్పటి నుంచి ఏర్పాట్ల పనులు చేపట్టాలని, బతుకమ్మ ఆడేందుకు అన్నివిధాల సదుపాయాలు కల్పించాలని నగరపాలక అధికారులను మహిళలు కోరుతున్నారు.

# రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి పరికిపండ్ల రాజలింగం మృతి

### పద్మశాలి ఉద్యోగ సంఘం నాయకుల నివాళి



ప్రజాపక్షం/ముత్తారం: తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల కోటేశం తండ్రి, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి పరికిపండ్ల రాజలింగం (85) ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ముత్తారంలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. గత రెండు నెలలుగా ఆయన తీవ్ర అనారోగ్యంతో పాటు వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ మృతి చెందారు. రాజలింగం మరణవార్త తెలిసిన వెంటనే తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు ఫోన్ ద్వారా జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశంను పరామర్శించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు కొలిపాక సారయ్య ఆధ్వర్యంలో జిల్లా నాయకులు ముత్తారంలోని రాజలింగం నివాసానికి చేరుకుని,ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి డాక్టర్ దుబాసి విష్ణుమూర్తి, జిల్లా కోశాధికారి కొలిపాక నగేష్,జిల్లా ఉపాధ్యక్షులు తాటికొండ వెంకటేశ్వర్లు,జిల్లా సహాయ కార్యదర్శి అనుమాండ్ల రాజశేఖర్,సంఘ ప్రాథమిక సభ్యులు బూర్ల రాజేందర్,ఇప్పనపల్లి మధుకర్,బుదరపు సంపత్,దొంతుల సురేష్,జిల్లా మినిస్ట్రియల్ స్టాఫ్ అధ్యక్షులు రంగు రవి, సూపరిండెంట్ సురేష్, మాజీ ఎంపీవో గోవర్ధన్, పద్మశాలి సంఘం నాయకులు గూట్ల రమేష్,చిలకాని సారయ్య,చిందం సదానందం,గడ్డం విద్యాసాగర్,నల్లాల శ్రీనివాస్,తదితరులు పాల్గొని మృతునికి నివాళులు అర్పించారు.

## మధుకర్‌జీకి రామగుండం నాయకుల అభినందనలు!



ప్రజాపక్షం/అంతర్గాం : తెలంగాణ రాష్ట్ర బిజెపి సంస్థాగత మంత్రి మధుకర్‌జీని ఆ పార్టీ రామగుండం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. రామగుండం నియోజకవర్గంలో చేపడ్తున్న పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తల సమన్వయం, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం వంటి అంశాలను మధుకర్‌జీ దృష్టికి తీసుకెళ్లినట్లు సంధ్యారాణి తెలిపారు. మధుకర్‌జీని కలిసిన వారిలో బిజెపి రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం, కందుల పోషం, జనగామ మండల అధ్యక్షుడు గుండెబోయిన భూమయ్య, మాదాసు వినయ్, అరవింద్‌లు ఉన్నారు.

## లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణకు నివాళులు



ప్రజాపక్షం/రామగిరిః రామగిరి మండలం సుందిళ్ల గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొరకొప్పుల సత్యనారాయణ మృతి చెందారు.ఆయన స్వగ్రామమైన సుందిళ్లలో నిర్వహించిన అంత్యక్రియల్లో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని,ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొరకొప్పుల సత్యనారాయణ మృతి కాంగ్రెస్ పార్టీకి, సుందిళ్ల గ్రామానికి తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొరకొప్పుల తులసిరామ్ గౌడ్, ఉమ్మడి కామాన్‌పూర్ మండల మాజీ జడ్పిటిసి గంట వెంకటరమణ రెడ్డి, ఉమ్మడి రత్నాపూర్ మాజీ ఎంపీటీసీ ముస్త్యాల శ్రీనివాస్,రామగిరి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మోత్కూరి అవినాష్ గౌడ్, సుందిళ్ల గ్రామ సర్పంచ్ మస్కుల నరేందర్ రెడ్డి,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గర్రెపల్లి ప్రవీణ్ గౌడ్,మాజీ అధ్యక్షుడు జనగామ కృష్ణస్వామి,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు 'యూనివర్సల్' విద్యార్థులు



ప్రజాపక్షం/పాలకుర్తి: కరీంనగర్‌లో త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి త్రోబాల్ సెలక్షన్ ట్రయల్స్‌లో పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఘన్‌శ్యామ్‌దాస్‌నగర్‌లోని యూనివర్సల్ ఐఐటీనీట్ ఫౌండేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు టి.మహీధర్, సాయి చేరిత్, సూరజ్ కుమార్‌ల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ విభాగంలో ఎంపికైన వీరు అక్టోబర్ 4న హైదరాబాద్ ఘట్‌కేసర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్, ప్రిన్సిపాల్ సయ్యద్ అఫ్జల్, పీఈటీ కల్వల సంతోష్ విద్యార్థులను అభినందించారు.

# ఘనంగా ప్రారంభించిన..అందని తాగునీరు!



ప్రజాపక్షం/రామగుండం : రామగుండం నగరపాలక పరిధిలోని విలేజి రామగుండం గ్రామంలో ఎన్‌టిపిసి సీఎస్సార్ నిధులతో నిర్మించిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ఇటీవల ఘనంగా ప్రారంభించారు. అయితే వాటర్ ప్లాంటు నుంచి మాత్రం చుక్క నీరు కూడ ప్రజలకు అందడంలేదు. నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హడావిడిగా వాటర్ ప్లాంటును ప్రారంభించారని, తర్వాత తాగునీటి సరఫరాను మరిచారని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఎన్‌టిపిసి వారు నిర్మాణం పూర్తి చేసి ఏడాది దాటిన ఇంకా ప్రారంభించడంలేదని తాము ప్రశ్నిస్తే ఇటీవల వాటర్ ప్లాంటును ప్రారంభించారని, మరి తాగునీరు సరఫరా చేసేందుకు ఇంకా ఎన్ని రోజులు పడ్తుందంటూ గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న కొత్త వాటర్ ప్లాంటును ఉపయోగంలోకి తెచ్చి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

# ఐపిఎస్ వేదికగా థాంగ్-టా సమరం



ప్రజాపక్షం/సుల్తానాబాద్: ఇండియన్ పబ్లిక్ పాఠశాల వేదికగా ఎస్‌జీఎఫ్ ఆ ధ్వర్యంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థా యి థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. అండర్14, అండర్17 బాలబాలికల విభాగాల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు.పోటీలను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మ ణ్,కరీంనగర్ జిల్లా థాంగ్‌టా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వికాస్ కుమార్, చందు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మ్యాచ్ రెఫరీలు లింగమూర్తి, గణేష్, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, కుమార్, విష్ణు, సుష్మా రెడ్డి, విజయ్, వెంకటేష్, రాకేష్, వినయ్, సత్యం, శివ, సతీష్, రణధీర్, డాకారులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతులు ప్రారంభం



**ప్రజాపక్షం/వేలేరు:** ఇటీవల కురిషిన వర్షాల తో వేలేరు మండలంలోని చింతలతండా ఎర్ర బెల్లి గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డు మరమ్మతు పనులను ఆదివారం ఎర్రబెల్లి గ్రామసర్పంచ్ కాలేరు శ్రావణ్ ఆద్వర్యంలో పనులు ప్రార ంభమయ్యాయి ఈసంధర్భంగా సర్పంచ్ శ్రావణ్ మాట్లాడుతూ చింతలతండా, ఎర్ర బెల్లిగ్రామాల మధ్య దీర్ఘ కాలంగా రహదారి గుంతల మయంగా మారడంతో వాహనదా రు లుఇరుగ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎ దుర్కొంటున్న సంధర్భంగా ఈరోడ్డు అభివృద్ధి ప నులు ఆదివారం ప్రారంభించడం జరిగిందని అన్నారు.కార్యక్రమంలో ఎర్రబెల్లి సర్పంచ్ గ్రామ సర్పంచ్ కాలేరు శ్రావణ్కుమార్,దస్తరి శ్రావన్,మాజీఎపిటిసి సాంబరాజు ,మాజీ సర్ప ంచ్ రామ్చందర్,లీగల్ అడ్వైజర్ సాంబయ్య, ఉపసర్పంచ్ భాస్కర్,పూజారి,పాల్గొన్నారు.

## బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధికార ప్రతినిధిగా పుల్లూరి



**ప్రజాపక్షం/ వరంగల్ :** నర్సంపేట మండలం ఇటుకాలపల్లి గ్రామానికి చెందిన పుల్లూరి కుమారస్వామిని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు నియామక పత్రం అందచేశారు. అక్టోబర్ 16న వరంగల్ జిల్లా 2 వ జిల్లా మహాసభలను జయప్రదం చేయడానికి, నర్సంపేట నియోజకవర్గంలో బిసి హక్కుల సాధన సమితిని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని పుల్లూరి కుమారస్వామి తెలిపారు

## వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

**ప్రజాపక్షం/ఖానాపురం:** వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఖానా పురం మండలంలో అటవీశాఖ అధికారుల స్థానికులకు వన్యప్రాణుల సంరక్షణపై అవ గాహన కల్పించారు. డిఆర్ఓ సుధాకర్, ఎఫ్బిఓ వెంకన్న ఆధ్వర్యంలో బుధరావు పేట బీట్తో పా టు చిలుకమ్మనగర్, పాఖాల బీట్ 1, అశోకనగర్ సెక్షన్లలో కార్యక్రమాలు నిర్వహించారు.మనిషి వన్య ప్రాణుల ఘ ర్షణ నివారణ, పశువుల నష్ట పరిహారం నిబంధనలు, వేట ఉచ్చుల నివా రణ చర్యలు, వన్యప్రాణుల సంరక్షణ, పరి రక్షణపై గ్రామస్థులకు వివరించారు. వన్య ప్రాణుల రక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో చిలుకమ్మనగర్ సర్పంచ్ బాధరబోయిన నరేష్, సింగ్ సుధాకర్, యోగి రమేష్, బేస్ క్యాంప్ వాచర్లు, గ్రామ స్తులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ మర్చంట్ అసో సియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అగ్రేసేన్ భవన్లో ఆది వారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని కాగజ్నగర్ డిఎ స్పి వహీదుద్దీన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మంచి ర్యాలకు చెందిన మెడిలైఫ్ ఎండి ఫిజీషియన్ డా. చేతన్ చౌహాన్ ఆధ్వర్యంలోని వైద్య బృందం ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు అందించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగిన ఈ శిబిరంలో కార్డియాలజీ నిపు ణులు డా. సురేంద్ర, పల్మనాలజీ డా. కుమారస్వామి కౌటం, యూరాలజీ డా. అభినయ్ కుమార్, ఆర్థోపెడిక్స్ డా. శ్రీధర్, గైనకాలజీ డా. ప్రసన్నకుమారి, జనరల్ సర్జరీ డా. చంద్రబోస్, రేడియాలజీ డా. ఎస్. శ్రీనివాస్, డెంటల్ డా. స్వప్నిక రోగులకు వైద్య సేవలందించారు. ఈ కార్యక్ర



మంలో టౌన్ సిఐ ప్రేమ్ కుమార్, వ్యాపారస్తులు చిలువేరు సత్యనారాయణ, మర్చంట్ అసోసియేషన్ సభ్యులు కొసన గొట్టు వెంకటరమణ, మహేష్ లోయా, అరుణ్ అగర్వాల్, కొడిప్యాక రవీందర్, హరి సోని, హితేష్ అగర్వాల్, లెక్క రర్లు డి. దేవేందర్, చిప్ప సత్యనారాయణ పాల్గొన్నారు.

# అడవి పందుల బెడదతో బెంబేలు

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండల కేంద్రంలో రాత్రివేళల్లో అడవి పందులు స్వైరవిహారం చేస్తుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవు తున్నారు. గత కొన్ని నెలలుగా జనావాసాల్లోకి గుంపులు గుంపులుగా వస్తున్న పందులతో ప్రజలు, ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. ముఖ్యంగా వీక్లీ మార్కెట్, రైల్వే స్టేషన్ రోడ్డు పరిసరాల్లో రాత్రి సమయంలో పెద్ద సంఖ్యలో అడవి పందులు సంచరిస్తున్నాయి. బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్కు వెళ్లే ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనదారులకు అకస్మాత్తుగా అడవి పందులు ఎదురవుతుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశముం దని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జడ్పి పాఠ శాల ముందు ఒక గుంపు, ఈడెన్ గార్డెన్ పాఠశాల సమీ పంలో మరో గుంపు, మూల మాలపు ప్రాంతంలో ఇంకో గుంపు పిల్లలతో సహా సంచరిస్తున్నట్లు బాటసారులు చెబు తున్నారు. గతంలో వారసంత ప్రాంతంలో ఓ నివాసిపై ఇంటి సమీపంలోనే అడవి పంది దాడి చేసి గాయపరిచిన ఘటన ఇంకా మరవకముందే మళ్లీ నిత్యం పందులు దాడు లకు తెగబడేలా రోడ్లపై తిరుగుతుండటం కలకలం రేపు తోంది. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని, పందుల గుంపులు కనిపించినప్పుడు వాటిని తరిమే ప్రయత్నం చేయకుండా దూరంగా వెళ్లాలని స్థానికులు సూచిస్తున్నారు. అడవి పందులు జనావాసా ల్లోకి, ప్రధాన రహదారులపైకి రాకుండా అటవీ అధికా రులు తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రైల్వే స్టేషన్, వీక్లీ మార్కెట్, పాఠశాలల పరిసరాల్లో రాత్రి సమయాల్లో నిఘా పెంచి తగిన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కడెంలో ఉచిత మెగా వైద్య శిబిరం!

## వైద్య సేవల్లో స్వప్న హాస్పిటల్ సరికొత్త అధ్యాయం!

### వైద్య బృందాన్ని అభినందించిన ఎస్ఐ సాయిదస్తురాబాద్

**ప్రజాపక్షం /నిర్మల్ :** నిర్మల్ జిల్లా కడెం మండల కేంద్రంలో స్వప్న మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనే జింగ్ డైరెక్టర్ డాక్టర్ స్వప్న శశికాంత్ ఆధ్వర్యంలో నిర్వ హించిన ఉచిత మెగా కార్డియో,ఆర్థో వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉమ్మడి కడెం మరియు దస్తురాబాద్ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు,ప్రజలు తరలివచ్చి ఈ ఉచిత వైద్య సేవలను విని యోగించుకున్నారు.శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యుల బృందం రోగులకు గుండె మరియు ఎముకలకు సంబం ధించిన వ్యాధులకు సంబంధించి అత్యాధునిక వైద్య పరీ క్షలు నిర్వహించింది. ప్రత్యేకంగా ఉచితంగా ఈసీజీ (ఇసిజి), 2డి ఎకో (2డి ఇcho) పలు రకాల ఆర్థోపెడిక్ పరీక్షలు చేసి, తగిన ఉచిత వైద్య సలహాలు, సూచనలు అందించారు.ఈ ఉచిత వైద్య శిబిరాన్ని కడెం సబ్ ఇన్ స్పెక్టర్ (ఎస్సై) సాయి సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు, గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇటువంటి ఉచిత సేవా కార్యక్రమాలు నిర్వ హించడం పట్ల డాక్టర్ స్వప్న శశికాంత్ ని, హాస్పిటల్




యాజమాన్యాన్ని మరియు వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసు కురావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు డాక్టర్ స్వప్న శశికాంత్ తెలిపారు. భవిష్యత్తులో కూడా పేద ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటి ఉచిత సేవా శిబిరా లను మరిన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తామని,ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వైద్య శిబిరానికి విచ్చేసిన పలువురు స్థానికులు మరియు బాధితులు ఉచి తంగా నాణ్యమైన పరీక్షలు అందించి, సలహాలు ఇచ్చినం దుకు హాస్పిటల్ బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు,గ్రామ ప్రముఖులు పాల్గొని కార్యక్ర మాన్ని విజయవంతం చేశారు.

## తన ఊరి ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ స్వచ్ఛంద శ్రమదానం

**ప్రజపక్షం/నర్సాపూర్ జి :** తన స్వగ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పనుల్లో భాగంగా తిమ్మాపూర్ (జి)గ్రామ సర్పంచ్ అలూర్ రాజేందర్ స్వయంగా పాల్గొని శ్రమదానం చేశారు.తన సుహస్తాలతో పారపట్టి పనులు చేపట్టి పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. =ప్రజాప్ర తినిధిగా బాధ్యతతో ముందుండి పనిచేసిన సర్పం చ్ను గ్రామస్తులు అభినందించారు. కార్యక్ర మంలో తన పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.



# బీడి కార్మికులకు చేయూత పెన్షన్ ఇవ్వాలి

### 6న ఛలో భైంసా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**ప్రజా పక్షం/భైంసా :** బీడీ కార్మికులకు, ప్యాకర్లకు, ప్రభుత్వం చేయూత ఫ్లెన్షన్ ఇవ్వాల్లని డిమాండ్ చేస్తూ, అక్టోబర్ 06 వ తేదీన తలపెట్టిన ఛలో భైంసా* కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ అను బంధం) పిలుపునిచ్చింది.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజన్న మాట్లాడుతూ తెల్లవారుజాము నుండే బీడీలు చుట్టి బతుకుతున్న వారికి ప్రభుత్వం నుండి ఎలాంటి భద్రత లేదని,వయసు మీద పడ్డాక వారి పరిస్థితి దయనీయంగా మారుతోం దని. కాబట్టి ఎన్నికల హామీలో భాగంగా మాటిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీడీ కార్మికులందరికీ చేయూత పెన్షన్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశార్యు.కార్మికుల॥హక్కుల సాధన కోసం అక్టోబర్ 6న భైంసాలో జరిగే ఛలో భైంసా కార్యక్రమంలో భాగంగా భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించబోయే ధర్నా కార్యక్రమానికి చేయూత పెన్షన్ రాని బీడీ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలు పునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు బక్కన్న, జిల్లా ఉపాధ్యక్షులు రామ లక్ష్మ ణ్, బీడీ యూనియన్ జిల్లా నాయకురాలు వి గోదావరి నాయకులు వి.మహేందర్, జి.నవీన్,తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యా యుల సంఘ నూతన కార్యవర్గ (2026 – 2028) ఎన్నికలు ఆది వారం (04–10–2026) స్థానిక పెన్షనర్స్ భవన్లో ఘనంగా నిర్వ హించారు. ఈ ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర బాధ్యులు, కోశాధికారి తుకారం సార్ స్వయంగా విచ్చేసి పర్యవేక్షించి, ఎన్నికలను సమర్థ వంతంగా నిర్వహించారు.ఈ ఎన్నికల్లో రాబోయే రెండేళ్ల కాలానికి సంబంధించి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు.ఎన్నికైన నూతన కార్యవర్గం జిల్లా అధ్యక్షుడు సాయన్న (ఎంఇఒ నర్సాపూర్)ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ (ఎంఇఒ కుబీర్) జిల్లా కోశాధికారి రాజశేఖర్ (గెజిటెడ్ ప్రధానోపాధ్యా యులు, బోసి)రాష్ట్ర కౌన్సిలర్లు మైసాజి (ఎంఇఒ బాసర్), విజయ (గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, సారంగపూర్)ఈ సందర్భంగా పూర్వపు జిల్లా అధ్యక్షుడు బి. మహేందర్ (ఎంఇఒ సారంగాపూర్), మాజీ ప్రధాన కార్యదర్శి సదానందం (ఎంఇఒ దిలావర్పూర్)లు నూతనంగా ఎన్నికైన బాధ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేసి, సంఘ బాధ్యతలను అధికారికంగా అప్పగించారు. కొత్తగా ఎన్నికైన నాయకులు సంఘ బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రంగసాయిపేటలో రావణవధకు ఏర్పాట్లు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** విజయదశమి సందర్భంగా ఈ నెల 20న రంగసాయిపేటలోని మహంకాళి ఆలయ ప్రాంగణంలో రావ ణవధ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభించినట్లు దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు గుండు పూర్ణచందర్ తెలిపారు. ఆదివారం కాంక్ష కన్వెన్షన్లో ఆయన అధ్యక్షతన ఉత్సవ సమితి సమావేశం జరిగింది. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై చర్చించి, ప్రజా ప్రతినిధులు, అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించారు. ప్రధాన కార్యదర్శి దామెరకొండ కరుణాకర్ మాట్లాడుతూ రావణవధ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పుర ప్రముఖులు తమ సలహాలు, సూచనలు అందించి సహకరించాలని కోరారు.

## ప్రాణాలు పోతేనే పట్టించుకుంటారా

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండల కేంద్రంలోని వాగుపై ఉన్న మెయిన్ బ్రిడ్జి మొదటి భాగంలో గుంత ప్రమాదకరంగా మారింది. గుంత ఏర్పడి నెలలు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు నిర్వహించే ఈ మార్గంలో గుంత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రజల భద్రత ప్రయాణ సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జిపై ఉన్న గుంతను పూర్తి మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## మండల వార్డు మెంబర్స్ ఫోరం ఇన్‌చార్జీల నియామకం

**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్ర వార్డు మెంబర్స్ ఫోరం అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు జిల్లా ఫోరం ఇన్‌చార్జి గుండేటి రాంచందర్ సమక్షంలో పాలకుర్తి మండల ఫోరం ఇంచార్జిగా పసులాది ప్రశాంత్, కో ఇంచార్జిగా కోలా లక్ష్మి నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు వార్డు మెంబర్లు, ఫోరం నాయకులు, ప్రజాప్రతినిధులు నూతన ఇంచార్జీలకు శుభాకాంక్షలు తెలిపారు. వార్డు మెంబర్ల సమస్యల పరిష్కారం, హక్కులు, గౌరవం కోసం ఐక్యంగా పనిచేస్తామని నూతన ఇంచార్జీలు తెలిపారు.

## అక్రమ బెల్ట్ షాపులు అరికట్టాలి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని 36 గ్రామ పంచాయతీల పరిధిలో నిరంతరంగా 24 గంటలు అక్రమ మద్యం దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తూ పేదల, అణగారిన వర్గాల జేబులను గుల్ల చేస్తూ వారు అనారోగ్యంపాలై వారి పిల్లలు, భార్యలు అనాథలుగా మారుతున్నారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పాలకుర్తి మండల కార్యదర్శి కొనకటి కళింగరాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లిబరేషన్ నాయకులు కళింగరాజు మాట్లాడుతూ వెంటనే మండల కేంద్రంలో అక్రమంగా నిర్వహిస్తున్న 25 షాపులపై దాడులు నిర్వహించి బెల్ట్ సాపులను మూయించాల్సిందిగా అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు బాబు, రాజు, రాహుల్, సారయ్య, బద్రి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడిగా పరమేశ్

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** మండలంలోని ఎల్లంల గ్రామానికి చెందిన సబ్బాని పరమేష్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ పద్మశాలి విభాగం ఉపాధ్యక్షునిగా నియమించారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన పద్మశాలి విశాగం జిల్లా అధ్యక్షులు సామల పరమేష్, జిల్లా కాంగ్రెస్ అద్యక్షురాలు లకావత్ దన్వంతి, నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి పరమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

## బహుజనులు, అణగారిన వర్గాలకు దక్కని అధికారం

### తెలంగాణ క్రాంతిదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పృథ్వీరాజ్



**ప్రజాపక్షం/ జనగామ :** తెలంగాణ ఏర్పడినా బహుజనులు, అణగారిన వర్గాలకు అధికారం దక్కలేదని తెలంగాణ క్రాంతి దళ్ వ్యవస్థాపక అధ్యక్షులు పృథ్వీరాజ్ అన్నారు. ఆదివారం జనగామలోని గ్లోరీ పంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను నిర్మాణం చేయాలనే లక్ష్యంతో బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా తెలంగాణ సర్వజన డెమోక్రటిక్ ఫోరం ఆధ్వర్యంలో చర్చా వేదిక జరిగింది. ఈ చర్చావేదికకు కన్నా పరశరాములు అధ్యక్షత వహించగా ప్రేమ్‌చందనాయక్, శంకర్‌నాయక్, చిన్నబాబు నాయక్ మంగళంపల్లి రాజు లు సమన్వయకర్తలుగా వ్యవహరించగా పృథ్వీరాజ్ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. బహుజనులంతా ఏకమై రాజ్యాధికారాన్ని సాధించున్నప్పుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశించిన సమసమాజం సాధ్యం అవుతుందన్నారు. పలువురు వక్తలు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఎందుకు అవసరం, దాని నిర్మాణం ఎలా ఉండాలి అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ చర్చా వేదికలో తెలంగాణ సర్వజన డెమోక్రటిక్ ఫోరం సలహాదారులు రేపల్లె నరోత్తమ సూరి, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోతు రాంబాబు, అఖిల భారత మహాజన సేనా నాయకులు శ్రీనివాస్ యాదవ్, కాళోజీ టివి ప్రతినిధి దాసరి శ్రీనివాస్, డిఎస్పీ ప్రధాన కార్యదర్శి బి దుర్గా ప్రసాద్, టిఎస్ టిటిఎఫ్ ఇస్లావత్ లక్ష్మినాయక్, కల్నన్ బిక్షపతి, డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్, గాంధీ నాయక్, జితేందర్, తెలంగాణ ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జేరిపోతులు కుమార్, జేరిపోతుల ఉపేందర్, రాగళ్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## స్వేరో జిల్లా నూతన కమిటీ ఎన్నిక

### జిల్లా అధ్యక్షుడిగా పృథ్వీరాజు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** అక్షరం ఆరోగ్యం ఆర్థికం ల క్ష్యంగా స్వేరోయిజం పనిచేస్తుందని స్వేరో రాష్ట్ర కో కన్వీనర్ గుర్రం నాగరాజు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్ర ంలో మాజీ స్వేరో జిల్లా అధ్యక్షుడు కోడెపాక రమేష్ బాబు ఆధ్వర్యంలో స్వేరో ఆత్మీయ సమ్మేళనం,జిల్లా నూతన క మిటీ ఎన్నిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్వేరో రాష్ట్ర కోకన్వీనర్ గుర్రం నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గుర్రం నాగరాజు మాట్లాడుతూ, అక్షరం ఆరోగ్యం ఆర్థికం లక్ష్య ంగా స్వేరో సంస్థ పనిచేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికంలో మగ్గుతున్న కుటుంబాల పిల్లలను విద్య వైపు నడిపించడంతో పాటు వారికి ఆర్థిక భరోసా కల్పించి అభివృద్ధి వైపు తీసుకెళ్లడమే స్వేరో ప్రధాన లక్ష్యమని తెలిపారు. కోడెపాక రమేష్ బాబు మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా స్వేరో ఆధ్వర్యంలో కొనసాగుతున్న సేవా కార్యక్రమాలతో ఎంతోమంది విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లుగా ఎదిగారని తెలిపారు. అజీమ్ ప్రేమ్‌జీ, ఢిల్లీ, పాండిచ్చేరి తదితర విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య అభ్యసించే అవకాశాలు కల్పించిన ఘనత స్వేరోకు దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా స్వేరో గౌరవ అధ్యక్షులుగా మంత్రి రాజబాబు, పసుల భాస్కర్, గుర్రం తిరుపతి, బొడ్డు రాజబాబు వ్యవహరించారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పృథ్వీరాజు, ప్రధాన కార్యదర్శిగా మంథని పున్నం చందర్ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా వినోద్,సుమన్,సురేష్, భవతు రాజుకుమార్, రామస్వామి,అజయ్, మహేష్, రాధాకృష్ణ, రజిని,అనిల్ తదితరులు ఎన్నికయ్యారు.

## ఫొటో గ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడిగా 13వ చింతల రమేష్



**ప్రజాపక్షం/చిట్యాల:** చిట్యాల మండలం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా 13వ సారి సైతం చింతల రమేష్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 24 సంవత్సరాలుగా అసోసియేషన్ అధ్యక్షులుగా కొనసాగుతున్న రమేష్ ముదిరాజ్ తిరిగి ఆయనే యూనియన్ అధ్యక్షులుగా ఎంపిక కావడం పట్ల ఫోటోగ్రాఫర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయిలో ఉన్న యూనియన్‌ను రాష్ట్ర స్థాయిలో ఉత్తమ యూనియన్‌గా నిలబెట్టడంలో ఆయన చేసిన కృషి అమోఘమని పలువురు ఫోటోగ్రాఫర్స్ కొనియాడారు. ఆదివారం కొడవటంచ శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవాలయం ఆవరణంలో, చిట్యాల మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చింతల రమేష్, ఉపాధ్యక్షులుగా పోశాల రాజు(బాబా రాజు), ప్రధాన కార్యదర్శిగా కొల్లూరి అశోక్, కోశాధికారిగా మాచర్ల సంజీవ్, సహాయ కార్యదర్శిగా బయగాని సందీప్, ప్రచార కార్యదర్శిగా గుర్రం తిరుపతి, ప్రత్యేక కమిటీ మెంబర్లుగా పోశాల రాజు, కట్కూరి రాజు, రాజేందర్, రమేష్, సాంబయ్య, కిరణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గత 24 సంవత్సరాల పాటు చిట్యాల మండలంలో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొనసాగుతున్న చింతల రమేష్‌ను ఫోటోగ్రాఫర్స్ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ ఫోటోగ్రాఫర్స్ పుల్ల రవితేజ, మెరుగు మహేందర్, సత్యసాయి రాజు, రవి, సతీష్, జూనియర్ ఫోటోగ్రాఫర్స్, తదితరులు పాల్గొన్నారు.

## దశదినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/టేకుమట్ల:** టేకుమట్ల మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొలుగూరి అనిల్ తల్లి ఇటీవల మరణించగా ఆదివారం దశదినకర్మ కార్యక్రమానికిఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై మృతురాలి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. అనంతరం ఎంఎల్‌ఏ మాట్లాడుతూ మృతురాలు కుటుంబ సభ్యులు ఎవరు అధైర్య పడద్దని వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ జడ్పిటిసి పులి తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కోటగిరి సతీష్, జిల్లా మండల నాయకులు వైనాల రవీందర్, పెరుమాళ్ల మొగిలి, దాసరపు సదానందం, కొయ్యల చిరంజీవి, బండ రగోత్తం, తోట సాగర్, కోరె చందు, మాజీ ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, గ్రామశాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదు



**ప్రజాపక్షం/ నర్సంపేట :** వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు, ఇంటింటి అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు,ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్స్ మద్దిరెడ్డి దామోదర్ రెడ్డి, దాసరి పవన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం, వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నీలారాపు నరేందర్‌లు కోరారు. నర్సంపేట నియోజకవర్గంలో జనసేన పార్టీ సన్నాహక సమావేశం నియోజకవర్గ నాయకులు మేరుగు శివకోటి యాదవ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాబోయే 40 రోజుల్లో పట్టభద్రుల ఓటరు నమోదు, ఇంటింటి అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. జనసేన అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ ముఖ్య నేతలు షేక్ హుస్సేన్, ఎలబోయిన డేవిడ్, గంగుల రంజిత్, రోడ్డ శ్రీకాంత్, బొబ్బ పృథ్వీరాజ్, ఆకారపు లహరి,మిలాన్, చందా స్రవంతి,మంజుల, రవి, చింతం అజయ్ రత్న, రాపోలు సురేష్, సంతపురి సందీప్, మాదరపు కృష్ణ, రవి వర్మ, బిక్షపతి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జర్నలిస్టుల సమావేశానికి తెలంగాణ ప్రతినిధులు




**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** అయోధ్యలో అక్టోబర్ 4, 5వ తేదీలలో నిర్వహిస్తున్న ఎన్‌యూజే ఐ యూనియన్ కౌన్సిల్ సమావేశానికి తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ప్రతినిదులు హాజరయ్యారు. జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమం వృత్తిపరమైన హక్కులపై సమావేశంలో చర్చించారు. ముఖ్య అతిథిగా హాజరైన పంచాయితి రాజ్ శాఖ మంత్రి చౌదరి భూపేంద్ర సింగ్‌ను టీఎస్‌జేయూ ఆధ్వర్యంలో సన్మానించారు. తెలంగాణ జర్నలిస్టుల సమస్యలను జాతీయ వేదికపై ప్రతినిధులు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం గౌడ్, రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, నాయకులు రజిత శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీనివాస్ పటేల్, వెంకట రమణ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండల కేంద్రంలోని లైఫ్ కేర్ జెనరిక్ ఫార్మసి సమీపంలో శరత్ మ్యాక్సిజెన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 60 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్యులు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో డా. కల్పన, రేవతి, వెంకట్రావు, రఘువరణ్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం /జనగామ:** కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇటీవల చేర్యాల మార్కెట్ కమిటి ఛైర్మన్‌గా నియమించబడిన కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు చేర్యాల మార్కెట్‌లో ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంఛార్జీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ జడ్పిటిసి, ఎంపిపిలు పార్టీల శ్రేణులు హాజరుకానున్నారు. కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి సోమవారం సాదాసీదాగా ప్రమాణ స్వీకారం చేసి కొద్ది రోజుల తరువాత భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. ప్రశాంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా మార్కెట్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.